ప్రజాశక్తి
సోమవారం 9 జూన్ 2025 5 అనంతపురం

యువతి దారుణహత్య

నాలుగు రోజుల క్రితం అదృశ్యమైనట్టు ఫిర్యాదు
శవమై లభించిన యువతి
పోలీసుల నిర్లక్ష్యంతోనే ఈ ఘటన అని తల్లిదండ్రుల ఆరోపణ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మహిళలపై అఘాయిత్యాలు ఆగడం లేదు. సత్యసాయి జిల్లా రామగిరి మండలంలో మైనర్ బాలికను అత్యాచార ఘటన మరువక ముందే అనంతపురం జిల్లాలో యువతిని దారుణంగా హత్య చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. యువతి అదృశ్యమై నాలుగు రోజులైందని తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా పోలీసులు సకాలంలో స్పందించకపోవడంతోనే తమ కుతురు చనిపోయిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పోలీసులు మాత్రం ఫిర్యాదు అందిన వెంటనే స్పందించామని చెబుతున్నారు. ఇదిలాగుండగా యువతి హత్యకు సంబంధించి ఆమె తండ్రి లక్ష్మీపతి తెలిపిన సమాచారం మేరకు పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం నగరంలోని రామకృష్ణ కాలనీలో నివాసముంటున్న లక్ష్మీపతి కుమార్తె తన్మయి (17) ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. మంగళవారం సాయంత్రం నుంచి తన్మయి కనిపించకపోవడంతో అనంతపురం నగరంలో ఒన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారిస్తున్నామని బెబుతున్నారే తప్ప ఎక్కడికెళ్లిందని గుర్తించలేదు. ఆదివారం మధ్యాహ్నం కూడేరు మండలం పరిధిలోని మణిపాల్ విద్యా సంస్థల వెనుకాలకాలిపోయి, సగం కుల్లిపోయివున్న యువతి మృతదేహం లభించింది. అది అదృశ్యమైన తన్మయిదేనా కాదా అన్నది గుర్తించాలని కూడేరు పోలీసుల నుంచి తన్మయి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఆ సమాచారం అందుకున్న వారు అక్కడకెళ్లి పరిశీలించి చనిపోయింది తమ కుమర్తెనని గుర్తించారు. నాలుగు రోజుల క్రితం అదృశ్యమైన తన్మయి శవమై కనిపించిందని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

కూడేరు మండల పరిధిలో లభ్యమైన తన్మయి మృతదేహం

పోలీసులు అనుమానితులకు ప్రశ్నించి ఉంటే

తమ కుమార్తె అదృశ్యమైన రోజే పోలీసులకు ఫిర్యాదు చేసామని తన్మయి తల్లిదండ్రులు చెబుతున్నారు. అనుమానితులుగానున్న వారి ఫోన్ నంబర్లు కూడా ఇచ్చామని చెప్పారు. అయితే అనుమానితుల పేర్లను విచారించి వారికి సంబంధం లేదని పోలీసులు వదిలేసారని ఆరోపిస్తున్నారు. ఆరోజే స్పందించి తగిన చర్యలు తీసుకుని ఉంటే తమ కుమార్తె బతికేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిందితుల కోసం గాలింపు ?

అదృశ్యమైన యువతి శవమై కనిపించడంతో పోలీసు యంత్రాంగం నిందితుల కోసం గాలింపు చేపడుతోంది. అదృశ్యమైన రోజు యువతితో మాట్లాడిన వారితోపాటు, ఎవరు ఈ హత్యకు కారణమై ఉంటారన్నది గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు.

నేడు మహిళా కమిషన్ సభ్యురాలు రాక

సత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడుగుర్రాల పల్లిలో మైనర్ బాలిక అత్యాచార బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ఎపి మహిళా కమిషన్ సభ్యులు డాక్టర్ షేక్ రుఖీయా బేగం జిల్లాకు రానున్నారు. బెంగళూరున ఉంచి వస్తున్న ఆమె మొదట బాలిక కుటుంబాన్ని పరామర్శిస్తారు. అనంతరం రామగిరి సర్కిల్ పోలీసుస్టేషన్ సందర్శించి వివరాలు తెలుసుకుంటారు. అనంతరం పుట్టపర్తికెళ్లి జిల్లా ఎస్పీని కలసి కేసు పురోగతికి సంబంధించి పూర్వాపరాలు తెలుసుకుంటారు. అనంతరం తిరుగు ప్రయాణమై బెంగళూరుకు వెళతారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు

ప్రజాశక్తి - అనంతపురం

రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చే విధంగా కార్మిక చట్టాలలో మార్పులు చేసిందని ఆ మార్పులను వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి ఓబులు డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో 'కార్మిక చట్టాల సవరణ, నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకై జులై 9 సార్వత్రిక సమ్మె'ను జయప్రదం చేయాలనే అంశంపై జిల్లా సదస్సు సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం నాగమణి అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి ఓబులు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ కార్మికులకు వేతనాలు సవరించలేదని, కార్మిక సంక్షేమ బోర్డుకు ఛైర్మన్, కమిటీ సభ్యులను నియమించలేదని అన్నారు. మరోప్రక్క పని గంటలు 8 గంటలను 12 గంటలకు పెంచటం, మహిళా కార్మికులతో పని చేయించుకునే విధంగా మార్పు చేయటం, ఓవర్ టైంను పెంచటం వంటి మార్పులను కార్మిక చట్టాలలో చేసిందని విమర్శించారు. దీనినిబట్టే ఇది కార్మిక అనుకూల ప్రభుత్వామో, కార్మిక వ్యతిరేక ప్రభుత్వమో అర్థం అవుతుందని అన్నారు. ఇప్పటికే మహిళలపై లైంగిక వేధింపులు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయని, అలాంటిది రాత్రిపూట పనులు చేయిస్తే మహిళలకు రక్షణ ఎలా ఉంటుందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక చట్టాలలో చేసిన మార్పులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకపోతే కార్మికవర్గం వీధిపోరాటాలకు సిద్ధమవుతుందని హెచ్చరించారు. సిఐటియు ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా కార్మిక చట్టాలలో మార్పులు చేసిందని విమర్శించారు. కార్మికుల శ్రమను దోపిడీ చేసి లాభాలు గడించేందుకు ఇన్ఫోసిస్ నారాయణమూర్తి, ఎల్అండ్‌టి సీఈవో సుబ్రమణ్యన్ మాట్లాడుతున్నారని, దానిని నిజం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తెస్తున్న లేబర్ కోడ్స్‌కు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం కార్మిక చట్టాలలో మార్పులు చేసిందని అన్నారు. వెంటనే మార్పు చేసిన చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తుందని, కార్మికవర్గం కన్నెర్ర చేస్తే ప్రభుత్వ పతనం తప్పదని హెచ్చరించారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కార్మిక అనుకూల విధానాలు తెస్తామని చెప్పి ఇప్పుడు పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు అనుసరిస్తున్నారని, కార్మికులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం మనం కూడా సాధించలేదని అన్నారు. శ్రామిక మహిళా కన్వీనర్ రమాదేవి మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో మహిళలపై హత్యలు, అత్యాచారాలు ఎక్కువయ్యాయని, ఇప్పుడు రాత్రిపూట మహిళా కార్మికులతో పని చేయించటం అంటే వారికి మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా చేయటమేనని అన్నారు. వెంటనే కార్మిక చట్టాలలో మార్పులు ఉపసంహరించుకోకపోతే మహిళా లోకం ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తుందని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు పని చేసే చోట లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు వేయాల్సి ఉందని, ఇప్పటికీ ఆ కమిటీలు ఎక్కడ వేశారో ప్రభుత్వ పరిశీలన కూడా లేదని అన్నారు. అలాంటిది ఇప్పుడు ఎలాంటి రక్షణ చర్యలు లేకుండా మహిళలను రాత్రులు పని చేయించటం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే కార్మిక చట్టాలలో చేసిన మార్పులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కోశాధికారి గోపాల్, అనంతపురం నగర అధ్యక్ష కార్యదర్శులు వెంకట్ నారాయణ, ముత్తుజ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మన్నెల రామాంజనేయులు, అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షులు శకుంతల, నిర్మల, మేరీ గోవిందమ్మ, లక్ష్మీ నరసమ్మ, పాతక్క రామాంజనమ్మ మెడికల్ రేప్ సీస్ యూనియన్ నాయకులు చంద్రశేఖర్, తాగునీటి కార్మికుల సంఘం నాయకులు రాము, అశోక్ సంజప్ప,మున్సిపల్ యూనియన్ నాయకులు బత్తల ఆది, ఎర్రి స్వామి, తిరుమలష్, ఆటో యూనియన్ నాయకులు ఆది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చికెన్, మటన్ వ్యాపారాలపై దాడులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని చికెన్, మటన్ వ్యాపారాలపై కమిషనర్ బాలస్వామి ఆధ్వర్యంలో ఆదివారం దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా పలు దుకాణాల యజమానులకు సింగిల్ ప్లాస్టిక్‌ను వాడుతున్నట్లు గమణించి రూ.1,02,000 అపరాధ రుసుం వసూలు చేశారు. కమిషనర్ బాలస్వామి, డిప్యూటీ కమిషనర్ డాక్టర్ పావని, సూపరింటెండింగ్ ఇంజినీర్ చంద్రశేఖర్ కలిసి లెక్చరర్స్ కాలనీలో ఉన్న చికెన్ షాపుల్లో ప్లాస్టిక్ తనిఖీలు చేసి నిషేధిత ప్లాస్టిక్ వాడిన 4 చికెన్ షాపులపై ఒక్కొక్క షాపుపై రూ.2500 చొప్పున అపరాధ రుసుం విధించారు. అలాగే పాతూరు మటన్ మార్కెట్, రాణీనగర్, 1వరోడ్డు నుంచి 6వ రోడ్డు వరకూ ఉన్న చికెన్ షాపుల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ బాలస్వామి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం నిలిచిపోయే వరకూ ఈ తరహా తనిఖీలు నిరంతరం కొనసాగుతాయన్నారు.

అనుమతిలేని విద్యాసంస్థలను సీజ్ చేయాల్సిందే..

ఐక్య విద్యార్థి సంఘాల నాయకుల హెచ్చరిక

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న శ్రీచైతన్య విద్యా సంస్థలను సీజ్ చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న ఆందోళన కార్యక్రమాల పోస్టర్‌లను ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఓతురు పరమేష్, కుళ్లాయి స్వామి, ఏఐఎస్‌బి జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మ, బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి సురేష్ యాదవ్‌లు హాజరై మాట్లాడుతూ అనంతపురం జిల్లా వ్యాప్తంగా శ్రీ చైతన్య విద్యా సంస్థలు విద్యను వాపారంగా మార్చి విద్యా మాఫియాగా తయారైందన్నారు. లక్షల రూపాయలు దండుకుంటున్న జిల్లా విద్యా శాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని విమర్శించారు. రక రకాల గ్రూపులు ఏర్పాటు చేసుకొని లక్షలాధి రూపాయలు దండుకుంటున్నారని మండిపడ్డారు. విద్యార్థులను క్రీడల వైపు చూడకుండా వారిని యంత్రాల్లాగా తయారు చేసే విధంగా శ్రీ చైతన్య విద్యా సంస్థల యాజమాన్యాలు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు శ్రీ చైతన్య విద్యా సమస్యలు చేస్తున్న దోపిడీని అడ్డుకట్టు వేయకపోతే సోమవారం నుంచి ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలకు శ్రీకారం చుడతామన్నారు. డిఈఓ కార్యాలయం ముట్టడికి పిలుపునిస్తామన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు

రాయదుర్గం అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

మార్కెట్‌యార్డ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే కాలవ

ప్రజాశక్తి - రాయదుర్గం రూరల్

రాయదుర్గం నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు అన్నారు. రాయదుర్గం వ్యవసాయ మార్కెట్ యార్డు లో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కాలవ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పట్టాలెక్కించటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రమిస్తున్నారన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్య వ్యవస్థలో సమూల మార్పులు చోటు చేసుకొంటున్నాయన్నారు. ఒకే సారి 16347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిది అని అన్నారు. ఆగిపోయిన జల్ జీవన్ మిషన్ పథకాన్ని రాయదుర్గం ప్రాంతానికి ఇవ్వాలని కోరిన వెంటనే ముఖ్యమంత్రి మంజూరు చేశారన్నారు. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందేలా పనులు చేయిస్తామన్నారు. వ్యవసాయదారులు అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కీలక బాధ్యత తీసుకోవాలన్నారు. కమిటీలో రైతు కుటుంబాల నుండి వచ్చిన వారినే నియమించామన్నారు.

మార్కెట్‌యార్డ్ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న హనుమంతరెడ్డి

32 ఏళ్ల తర్వాత ఈ స్థాయికి వచ్చాను : అధికార, ప్రతిపక్ష హెూదాలో ఉన్నప్పటికీ కార్యకర్తల కు అండగా, పార్టీ కి అంకితభావంతో పని చేశానని, 32 ఏళ్ల తర్వాత ఈ స్థాయికి వచ్చానని మార్కెట్ యార్డ్ ఛైర్మన్ హనుమంత్ రెడ్డి పేర్కొన్నారు. ఒక నాయకుడిని నమ్ముకుని రాజకీయం చేస్తే కచ్చితంగా గుర్తింపు వస్తుందనడానికి తానే నిదర్శనం అన్నారు. సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన తనకు ఈ పదవి దక్కడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ హనుమంత్ రెడ్డి, వైస్ ఛైర్మన్ రాఘవేంద్ర, సభ్యులు 13 మందితో మార్కెట్ యార్డ్ కార్యదర్శి శ్రీనివాసులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో టిడిపి అనంతపురం అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, కూటమి నాయకులు అంకాల్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, మంజునాథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామానికి పోటెత్తిన జనం

ప్రజాశక్తి-అనంతపురం

బక్రీద్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని నగర శివారులో ఉన్న అనంతపురం శిల్పారానికి జనం పోటెత్తారు. ఇందులో భాగంగా డాన్స్ మాస్టర్ మక్బూల్ బాషా, మక్బూల్ నృత్య అకాడమీ, డాన్స్ మాస్టర్ రమణ, రామ్ డాన్స్ అకాడమీ బృందం సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భారీ ఎత్తున జనం తరలివచ్చి కార్యక్రమాలను తిలకించినట్లు శిల్పారామం పరిపాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి తెలిపారు.

శిల్పారామానికి భారీగా తరలివచ్చిన జనం

వేలకు బస్సు రాకపోవడంతో గుంపుగా బస్సును ఎక్కుతున్న ప్రయాణికులు

వేళకు రాని ఆర్టీసీ బస్సులు..!

ప్రయాణికుల ఇబ్బందులు

ప్రజాశక్తి-యల్లనూరు

తాడిపత్రి నుంచి యల్లనూరు మీదుగా సింహాద్రిపురం వరకూ నడుస్తున్న ఆర్డీసీ బస్సులు వేలకు రావడంతో లేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్సులు సమయానికి రాకపోవడంతో ప్రయివేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని అంటున్నారు. ప్రయివేటు వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తుండటంతో ప్రమాదాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. ముఖ్యంగా వైఎల్ఆర్ 3, 4, 5 బస్సు సర్వీసులను సమయానికి నడిపితే ఇబ్బందులు ఉండవని చెబుతున్నారు. ఈ విషయమై ఆర్టీసీ అధికారులతో ఆరాతీయ యల్లనూరు నుంచి తాడిపత్రి వరకూ అధిక సంఖ్యలో జీపులు నడుస్తుండటంతో ఆర్టీసీ బస్సులకు కలెక్షన్ లేనందున బస్సులు వేలకు తిప్పలేకపోతున్నామని చెపుతున్నారు. గతంలో కనీసం వారినికి ఒకసారైనా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టేవారు. ఈ మధ్యకాలంలో ట్రాన్స్‌పోర్ట్ అధికారులు కనిపించకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి ఆర్‌టిసి బస్సులను వేలకు నడిపేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

డీఈవో కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి అనంతపురం సిటీ

ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న పదోన్నతులు మరియు బదిలీలలో ప్రభుత్వం తాను ఇచ్చిన హామీకి వ్యతిరేకంగా జరిపిస్తోందని ఉమ్మడి జిల్లాల ఐక్య ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని డీఈవోకార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఐక్య ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ గత నెల 19, 20 తేదీలలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులతో ప్రభుత్వం చేసిన చర్చల సందర్భంగా ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సిలింగ్ అమలు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయకుండా వెబ్ కౌన్సిలింగ్ విధానాన్ని అమలు చేయడానికి నిర్ణయించారని విమర్శించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వెబ్ కౌన్సిలింగ్ అంగీకరించేది లేదని మాన్యువల్ కౌన్సిలింగ్ వచ్చేవరకు ఎన్ని రోజులైనా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబు స్పందిస్తూ ఉపాధ్యాయులను ఉద్దేశించి తమ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్షులు లింగమయ్య ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు జయ చంద్రారెడ్డి, సుధాకర్, ఏపీ వైఎస్ఆర్‌టిఎ నాయకులు నాగిరెడ్డి, శ్రీధర్ గౌడ్, ఏపీపీటీఏ గోపాల్ రెడ్డి, వెంకటరత్నం, ఎస్‌టియు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, హరి ప్రసాద్ రెడ్డి, ఏపీయుఎస్ ఎర్రిస్వామి, ఏపీటీఎఫ్ వెంకటేశులు, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల నాయకులతో మాట్లాడుతున్న డీఈవో ప్రసాద్ బాబు

సహకార సంఘాల ద్వారా మెరుగైన సేవలు

సహకార శాఖ జిల్లా అధికారి కృష్ణానాయక్

ప్రజాశక్తి- పుట్టపర్తి అర్బన్

రైతుల సంక్షేమానికి వారి అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నేతత్వంలో ప్రాథమిక సహకార పరపతి సంఘాల ద్వారా మెరుగైన సేవలు అందించడానికి కషి చేస్తున్నామని జిల్లా సహకార శాఖ అధికారి కష్ణనాయక్ తెలిపారు. కేవలం రైతుల అభివృద్ధి కోసమే ప్రాథమిక సహకార సంఘాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దాదాపు 75 ఏళ్ల క్రితమే ఈ సంఘాలను (సొసైటీ) ప్రభుత్వం ఏర్పాటు చేసి రైతులకు రుణ సదుపాయాలు కల్పిస్తోంది. ఆయా సంఘాల నుంచి ఐదు వేల మంది సభ్యులుగా ఉంటారు. ఆ సంఘాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు సరఫరాలతో పాటు రబీ, ఖరీఫ్ సీజన్లో అవసరమైన వారికి రుణ సదుపాయాలు కూడా కల్పిస్తారు. ఆయా సంఘాలకు కేవలం రైతుల ద్వారానే అధ్యక్షులు, డైరెక్టర్లను ఎన్నికల ద్వారా ఎన్నుకుంటారు. ఈ పాలకవర్గం రైతుల అభ్యున్నతికి కషి చేస్తుంది. పంటల పెట్టుబడికి, వ్యవసాయానికి ఆ సంఘాలు రుణాలు అందిస్తాయి. చాలామంది రైతులు ఈ సంఘాల ద్వారానే రుణాలు పొందుతారు. కొన్ని సంఘాల ఆధ్వర్యంలో సహకార బ్యాంకులు ఏర్పడ్డాయి. పాలకవర్గం సిఫారసుతో సహకార బ్యాంకులో రుణాలు అందిస్తారు. అతివృష్టి, అనావృష్టితో ఇబ్బందులను ఎదుర్కొంటున్న రైతుల కోసం మరిన్ని సేవలు అందించడానికి కంప్యూటరైజేషన్ చేపట్టారు. దీంతో ఇకపై ఆన్ లైన్ ద్వారా సేవలు అందించవచ్చు. ఉమ్మడి వ్యవసాయం, ఉమ్మడి వ్యాపారాలను రైతులు చేసుకునే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో రైతులకు అందిస్తున్న సేవలపై జిల్లా సహకార శాఖ అధికారి కష్ణనాయక్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని ప్రాథమిక సహకార సంఘాలు ఉన్నాయి? ఎంతమంది సభ్యులు ఉన్నారు?

జవాబు: జిల్లాలో 54 ప్రాథమిక సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. అందులో 1.96 లక్షల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. రైతులందరితో ఈ కేవైసీ చేయించి కంప్యూటరీకరణ చేశాం. దీంతో రైతులకు ఆన్ లైన్ ద్వారా మెరుగైన సేవలు అందించడానికి అవకాశం ఉంటుంది.

ప్ర: రైతులకు సంఘాల ద్వారా అందిస్తున్న సేవలు వివరించండి?

జ : రైతులకు గతం నుంచి పంట పెట్టుబడికి, వ్యవసాయానికి అవసరమైన రుణాలు అందిస్తున్నాము ప్రస్తుతం ఉమ్మడిగాను, వ్యక్తిగతంగా కూడా రైతుల అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటున్నాం. ఉమ్మడి వ్యాపారాలు చేసుకునే రైతులకు ఉపయోగపడే విధంగా సహకారం అందించడం జరుగుతుంది. ఉమ్మడిగా ఎరువులు అమ్మకం, పాల డైరీ, పాల ఉత్పత్తులు, పాడి పశువులు, ట్రాక్టర్లు, గ్యాస్ కనెక్షన్, పెట్రోల్ బంక్ నిర్వహణ, పచ్చి గడ్డి పెంపెకం తదితర 25 రకాల వ్యాపారాలు నిర్వహించుకుని అభివృద్ధి చెందడానికి అవకాశం కల్పిస్తున్నాం.

ప్ర: రైతుల ఉమ్మడి వ్యాపారాలకు విధానాలు ఏమిటి?

జ: సహకార సంఘాల్లో సభ్యులుగా ఉన్న రైతులు ఉమ్మడిగా రైతులకు సంబంధించిన వ్యాపారాలు చేపట్టవచ్చు. ఈ విధంగా జిల్లాలో ఇప్పటికే 18 సంఘాలు పనిచేస్తున్నాయి. ఈ వ్యాపారాలు చేపట్టడానికి రైతులు రూ.25 లక్షలు పెట్టుబడి పెడితే ప్రభుత్వం మరో రూ. 25 లక్షలు సమకూర్చుతుంది. ఇప్పటికే సోమందేపల్లి, బండ్లపల్లి సొసైటీలలో వ్యాపారాలు జరుగుతున్నాయి. వారి వివరాలు అన్ని కంప్యూటర్లో నిక్షిప్తమయ్యాయి. త్వరలోనే మిగిలిన సంఘాలకు కూడా కంప్యూటరీకరణ పూర్తి అవుతుంది. దీంతో మొత్తం వ్యవహారాలన్నీ ఇకపై ఆన్లైన్ ద్వారా జరుగుతాయి. రైతులకు ఉపయోగపడే విధంగా సేవలు కొనసాగుతాయి. వ్యాపార నిర్వహణలో అవసరమైన శిక్షణను కూడా రైతులకు ఇవ్వడం జరుగుతుంది. రైతులకు ఉమ్మడి వ్యాపారాలలో వచ్చే ఆదాయం సమంగా పంచుకోవచ్చు. ప్రభుత్వం అందించే రాయితీలు కూడా రైతులు పొందే అవకాశం ఉంటుంది.

ప్ర: రైతులకు మీరు ఇచ్చే సలహాలు ఏమిటి.?

జ : ఉమ్మడిగా లేదా వ్యక్తిగతంగా రైతులకు ఉపయోగపడే వ్యాపారాలు నిర్వహించుకోవచ్చు. సంఘాలలో ఉన్న రైతులు తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించాలి. తద్వారా మరికొన్ని సంఘాలకు రుణ సౌకర్యం కల్పించడానికి అవకాశం ఉంది. మొండి బకాయిల స్థాయికి చేరకుండా సక్రమంగా వ్యాపారాలు నిర్వహించుకోవాలి. తద్వారా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది. ఆయా వ్యాపారాల పర్యవేక్షణ ఆయా సంఘాల అధికారులు చూస్తుంటారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

సహకార శాఖ జిల్లా అధికారి కృష్ణానాయక్

'సాక్షి'పై చర్యలు తీసుకోవాలి

'తెలుగు' మహిళల ఆందోళనలు

తెలుగుదేశం మహిళలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి-అనంతపురం

రాజధాని అమరావతి మహిళలపై వైసిపి నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం జిల్లావ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ మహిళలు నిరసనలు వ్యక్తం చేశారు. పలు మండలాల్లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లాకేంద్రంలోని సాక్షి పత్రికా కార్యాలయాన్ని తెలుగు మహిళలు ముట్టడించారు. విషయం తెలుసుకున్న పోలీసులు మహిళలను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగు మహిళా అధికారి ప్రతినిధి సంగా తేజస్విని వాల్మీకి మాట్లాడుతూ రాజధాని అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసిపి నాయకులతోపాటు కథనాలు ప్రచురించిన సాక్షి మీడియాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజధాని అమరావతి, ఆ ప్రాంత మహిళలపై విషం చిమ్ముతున్న సాక్షి మీడియా, అధినేత వైఎస్ భారతిరెడ్డిపై కేసులు నమోదు చేయాలన్నారు. వైసిపి నాయకులకు మహిళలంటే గౌరవం లేదన్నారు. వెంటనే జర్నలిస్టు కొమ్మినేనిపై కూడా కేసు నమోదు చేయాలన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా నాయకులు స్వప్న, చరిత, మల్లీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఇఏపిసెట్ ఫలితాల్లో 'నలంద'కు అత్యుత్తమ ర్యాంకులు

ర్యాంకులు సాధించిన విద్యార్థులు

ప్రజాశక్తి-అనంతపురం

ఈఏపీసెట్ ఫలితాల్లో అనంతపురం నలంద జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంజినీరింగ్‌లో రాష్ట్రస్థాయిలో కె.శివానందరెడ్డి 4152 ర్యాంకు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచినట్లు ప్రిన్సిపాల్ ఎం.ఖాజీబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా ఎం.నాగతేజ-7162 ర్యాంకు, ఎస్.శిరీషా 8024 ర్యాంకు, కె.నిహారిక-14,018 ర్యాంకు, పి.హర్షితచౌదరి-15,508 ర్యాంకు, ఎస్.యశ్వంత్‌రెడ్డి 18,000 ర్యాంకు సాధించినట్లు తెలిపారు. వీటితోపాటు నలంద కళాశాలకు చెందిన 145 మంది విద్యార్థులు అత్యుత్తమ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశానికి అర్హత సాధించారని వివరించారు. వ్యవసాయ ఫార్మసీ విభాగ ఫలితాలలో నలంద కళాశాలకు చెందిన 16 మంది విద్యార్థులు అత్యుత్తమ వ్యవసాయ కళాశాలలో ప్రవేశానికి అర్హత సాధించారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను నలంద విద్యాసంస్థల ఛైర్మన్ అట్లూరి విజయబాబు, రీజినల్ హెడ్ కేతినేని మాధవరావు, ప్రిన్సిపాళ్లు ఖాజీబాబు, జె.వినోద్‌బాబుఅభినందించారు.

మహిళలకు జగన్ క్షమాపణ చెప్పాలి

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల

వైసిపి అధినేత వైఎస్ జగన్ రాష్ట్ర ప్రజలతోపాటు మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సాక్షి ఛానల్లో జరిగిన డిబేట్‌లో 'అమరావతి వేశ్యల రాజధాని' అంటూ ఓ జర్నలిస్టు ముసుగులో వ్యక్తి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రాజధాని అమరావతికి భూములు ఇచ్చిన రైతుల కుటుంబాల్లో మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేయడంతోపాటు శీలాన్ని హననం చేసేస్థాయికి వైసిపి నాయకులు దిగజారడం బాధాకరమన్నారు. వైసిపిని రాష్ట్ర ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసిన వారికి బుద్ధి రాలేదంటే ప్రజలపై ఎంత కక్ష పెంచుకున్నారో అర్థం అవుతుందన్నారు. ప్రజల దృష్టిని మరల్చేందుకు జగన్ చేస్తున్న నీచ రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, మళ్లీ కూడా బుద్ధి చెబుతారన్నారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు కళ్లు తెరిచి ప్రజలు, ముఖ్యంగా మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆర్యవైశ్య వసతిగృహంలో అడ్మిషన్లకు ఆహ్వానం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నగరంలో వివిధ కళాశాలల్లో చదివే ఆర్య వైశ్య విద్యార్థులకు రాయలసీమ కళాశాల ఆర్యవైశ్య విద్యార్థి వసతి గృహంలో అడ్మిషన్లు చేసుకోవచ్చని ఆర్య వైశ్య విద్యార్థి వసతిగృహం కార్యదర్శి ముడియం రమణ ఆదివారం తెలిపారు. నగరంలోని రాజురోడ్డులో ఉన్న రాయలసీమ కళాశాల ఆర్య వైశ్య వసతిగృహంలో 2025-26 విద్యా సంవత్సరానికి చేరాలనుకునే ఆర్య వైశ్య విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఆర్య వైశ్య విద్యార్థులు వసతి కోసం సంస్థ కార్యదర్శి ముడియం రమణ సెల్ 77021 59505, 93466 95563 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం

కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-శింగనమల

రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని రాచేపల్లి, నాయనవారిపల్లి గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వ్యవసాయ రంగంలో అధిక మోతాదులో ఉపయోగించే ఎరువులు, పురుగు మందులకు స్వస్తి చెప్పి, పంటల సాగులో రైతులు వైవిధ్యతను ప్రోత్సహించాలని రేకులకుంట శాస్త్రవేత్త డాక్టర్ నారాయణ స్వామి సూచించారు. అలాగే నూతన సాంకేతికత, కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ పథకాలపై సమాచారం, నూతన పద్ధతులు, వంగడాల విషయాలు, డ్రోన్ స్ప్రేయింగ్ తదితర అంశాలపై డాక్టర్ నారాయణ స్వామి వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు నారాయణస్వామి, కిషోర్‌రెడ్డి, ముత్యాలరావు, మండల వ్యవసాయ అధికారి అన్వేష్‌కుమార్, పశు వైద్య అధికారి డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారిణులు అక్కమ్మ, విశ్వేశ్వరి, రాచేపల్లి, సలంచెరువు, శింగనమల, ఉల్లికల్లు రైతు సేవా కేంద్రా అధికారులు నాగశేషు, రాజేశ్వరి, పవన్‌కుమార్, విజయ్, ఫయాజ్, ఉమాదేవి, సంధ్యారాణి, నాయనవారిపల్లి, రాచేపల్లి రైతులు పాల్గొన్నారు.

భీష్మ ప్రతిభా పురస్కారాలు ప్రదానం

పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో బెస్తసేవా సంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

నగరంలోని గంగపుత్ర కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం బెస్త సామాజిక వర్గానికి విద్యార్థులకు భీష్మ ప్రతిభా పురస్కారాలు అందజేశారు. జిల్లావ్యాప్తంగా పది, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెస్త సేవా సంఘం జిల్లా అధ్యక్షులు కెవి రమణ ఆధ్వర్యంలో పురస్కారాలతోపాటు మొమెంటోలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బెస్త సేవా సంఘం గౌరవాధ్యక్షులు బాలసుబ్రమణ్యం, చంద్రబాబు, నియోజకవర్గాల అధ్యక్ష, కార్యదర్శులు, గంగాధర్, నాగేంద్ర, రమేష్, నారాయణస్వామి, గంగప్ప, ఎర్రిస్వామి, శివశంకర్, గురుప్రతాప్, బిఎ శ్రీనివాసులు, శేషాద్రి, శంకర్, చేపల హరి, వెంకీ, శ్రీనివాసులు, సురేష్, మల్లికార్జున, జయశంకర్, తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల మహిళలకు కరువైన రక్షణ

విలేకరులతో మాట్లాడుతున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

కళ్యాణదుర్గం టౌన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక అణగారిన మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఎంఆర్‌పిఎస్ నాయకులు మండిపడ్డారు. ఆదివారం శెట్టూరు మండలం చెర్లోపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో మైనర్ దళిత బాలికపై జరిగిన అత్యాచార ఘటన బాధాకరమన్నారు. వెంటనే నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు టైలర్ వన్నూర్‌స్వామి, పార్లమెంట్ అధ్యక్షులు గౌరయ్య మాదిగ, చింతర్లపల్లి మాజీ సర్పంచు బాబురావు, కళ్యాణదుర్గం మండల అధ్యక్షులు జన్నె సురేష్‌బాబు మాదిగ, మిద్దె సుధాకర్, చింతర్లపల్లి మల్లయ్య, మైనార్టీ సంఘం నాయకులు ఖాశీమ్‌సాబ్, రోజావలి, తదితరులు పాల్గొన్నారు.

'చలో అమరావతి'ని జయప్రదం చేయండి

ఎపి కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య

పామిడిలో పోస్టర్లు విడుదల చేస్తున్న ఎపి కౌలు రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-పామిడి

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11వతేదీన చేపట్టనున్న చలో అమరావతిని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపి కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని గజరాంపల్లి గ్రామంలో ఉన్న ఆర్డీటీ పాఠశాలలో కౌలు రైతుసంఘం గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు రూ.లక్షలు పెట్టుబడి పెట్టి పండించిన పంటలకు మార్కెట్, గిట్టుబాటు ధర లేక అప్పుల పాలై దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. కౌలు రైతులందరికీ గ్రామసభల ద్వారా గుర్తించి సీసీఆర్సీ కార్డులు ఇవ్వాలని, అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని, 90శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ కాయలు, పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు బ్యాంకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన చలో అమరావతి కార్యక్రమంలో రైతుల, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దఎర్రిస్వామి, రామాంజనేయులు, పెద్దలాలప్ప, సుమతి, మారెన్న, రంగనాయకులు, మహేష్, సురేంద్ర, శివ, నారాయణ, రామచంద్ర, సుధాకర్, కౌలు రైతులు పాల్గొన్నారు.

ఉరవకొండ : మండల పరిధిలోని మోపిడి గ్రామంలో ఈనెల 11న కౌలు రైతుల సమస్యల సాధనకు పిలుపునిచ్చిన చలో మంగళగిరికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వెంకటేశులు, అధ్యక్ష, కార్యదర్శులు సుంకన్న, రామ్మూర్తి, ఆంజనేయ, వెంకటేశులు, రమేష్, లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలపై నిర్లక్ష్యం తగదు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

2025 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం జిల్లా స్థాయిలో షైనింగ్ స్టార్స్ అవార్డు పేరుతో ఇస్తున్న ప్రోత్సాహక కార్యక్రమానికి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులపై నిర్లక్ష్యం చూపడం అన్యాయమని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతరు పరమేష్ ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఈనెల 9వతేదీ నుంచి ప్రోత్సాహ బహుమతులు ఇవ్వనున్నారని, అయితే ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులపై జిల్లా విద్యాశాఖ అధికారులు తీవ్రమైన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఎక్కువ మందికి అవకాశం కల్పించకపోవడం చాలా దురదృష్టకరమన్నారు. 184 మందిని ఎంపిక చేస్తే వారిలో ఎక్కువ శాతం మంది విద్యార్థులు కార్పొరేట్ ప్రయివేట్ విద్యాసంస్థలకు సంబంధించిన వారే ఉన్నారని తెలిపారు. 2025 విద్యా సంవత్సరంలో అత్యధిక మార్కుల సాధించిన వారిలో ప్రభుత్వం షైనింగ్ స్టార్ పేరుతో ప్రభుత్వం అందజేస్తున్న అవార్డుల కార్యక్రమంలో కేజీబీవీ, గురుకుల, మోడల్ స్కూల్స్, మున్సిపల్, జెడ్పీ హైస్కూళ్లలో మార్కులు సాధించిన విద్యార్థులు కనపడలేదా అంటూ ప్రశ్నించారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు మరోసారి పున: పరిశీలించి ప్రభుత్వ పాఠశాల అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను గుర్తించి ప్రోత్సాహక బహుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే షైనింగ్ స్టార్స్ విద్యార్థులు ఎంపిక చేసిన అంశంపై సమగ్రమైన విచారణ చేయాలన్నారు.

కొనసాగుతున్న 'సేవ్ ఆర్డీటీ' పాదయాత్ర

ఎమ్మెల్సీలు మంగమ్మ, శివరామిరెడ్డి, మాజీ ఎంపీ అనంత సంఘీబావం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మంగమ్మ, పక్కన ఎమ్మెల్సి శివరామిరెడ్డి, తలారి రంగయ్య

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

సేవ్ ఆర్డీటీ పేరుతో మాజీ ఎంపీ తలారి రంగయ్య చేపట్టిన పాదయాత్ర ఆదివారం పలువురికి సంఘీబావాల మధ్య కొనసాగింది. శెట్టూరు మండలం బోచ్చుపల్లి, కైరేవు, చెర్లోపల్లి, లక్ష్ముంపల్లి గ్రామాల్లో పాదయాత్ర సాగింది. యాత్రకు ఎమ్మెల్సీలు మంగమ్మ, శివరామిరెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంతవెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి, మహాలక్ష్మి శ్రీనివాస్, చవ్వా రాజశేఖర్‌రెడ్డి సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ఆర్డీటీ ప్రభుత్వాలకు సమానంగా పేదలకు సేవలు అందించిందన్నారు. ఇలాంటి సంస్థకు ఇతర దేశాల నుంచి వచ్చే నిధులు ఆగిపోవడం దురదృష్టకరమన్నారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆర్డీటీకి విదేశీ నిధులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. చెర్లోపల్లిలో పలువురు రైతులు ట్రాక్టర్లతో పాదయాత్రకు సంఘీబావం తెలిపారు. ఈకార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు ఉమామహేశ్వర్‌నాయుడు, రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిన్ ట్యూమర్లపై అవగాహన పెంచుకుందాం

న్యూరోసర్జన్ డాక్టర్ టివి కృష్ణకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

బ్రెయిన్ ట్యూమర్లపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని న్యూరోర సర్జన్ డాక్టర్ టివి కృష్ణకాంత్‌రెడ్డి సూచించారు. ఆదివారం అంతర్జాతీయ బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ 8న అంతర్జాతీయ మెదడు కణితుల (బ్రెయిన్ ట్యూమర్) దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదడులోని కణితులపై అవగాహన కల్పించడం, తొందరగా గుర్తించడాన్ని ప్రోత్సహించడం, బాధితులకు మద్దతుగా నిలవడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రెయిన్ ట్యూమర్ బాధితులు, కుటుంబాలు ఎదుర్కొంటున్న సవాళ్లను గుర్తు చేస్తూ, మెరుగైన ఫలితాల కోసం సమిష్టిగా చైతన్యం కలిగించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా బ్రెయిన్ ట్యూమర్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. బ్రెయిన్ ట్యూమర్లపై అవగాహన పెంచుకుని బాధితులకు అండగా నిలవాలన్నారు. అలాగే కొత్త చికిత్సలు అభివృద్ధి చెందేలా పరిశోధనలకు మద్దతు ఇవ్వాలన్నారు. తిరుమల ఆసుపత్రిలో న్యూరోసర్జరీ విభాగం ఆధునిక పరికరాలతో సమీకృతంగా పని చేస్తోందన్నారు. బ్రెయిన్ ట్యూమర్లను గుర్తించేందుకు, అత్యుత్తమ చికిత్స అందించేందుకు న్యూరోసర్జన్‌తో పాటుగా మల్టీ-డిసిప్లినరీ టీమ్ ద్వారా సమగ్ర వైద్యం అందిస్తున్నామని వివరించారు.

అనాథ పిల్లలకు ఆర్‌డిఓ భరోసా

ప్రజాశక్తి కథనానికి స్పందన

అనాథ పిల్లలతో మాట్లాడుతున్న ఆర్డీఓ వసంతబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గంటౌన్

తల్లిదండ్రులు మృతిచెందడంతో అనాథలుగా మారిన చిన్నారులపై 'చిన్నారులను వెంటాడిన కష్టం' అనే శీర్షికతో ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి ఆర్డీవో వసంతబాబు స్పందించారు. ఇందులో భాగంగా తహశీల్దార్ బాస్కర్‌తో కలిసి ఆదివారం పట్టణంలోని సిద్దప్పవంక కాలనీలో ఉన్న బాధిత కుటుంబాన్ని చిన్నారులను కలిశారు. చిన్నారులు త్రిలోక్‌నాథ్, శివకుమార్ ఆత్మస్థైర్యంతో ఉండాలని భరోసా ఇచ్చారు. చదువుల్లో వెనకడుగు వేయొద్దని తాము అండగా ఉంటామన్నారు. ఇద్దరినీ ప్రభుత్వ రెసిడెన్సియల్ పాఠశాలల్లో చెర్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంతేగాకుండా వ్యక్తిగతంగా తనవంతు ఆర్థికసాయం అందించి పిల్లలకు ధైర్యం కల్పించారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అనంతపురం కలెక్టరేట్ : జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ రెవెన్యూ భవనంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు అర్జీలు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్థికసాయం

పామిడి : కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మృతిచెందిన స్థానిక 10వవార్డుకు చెందిన బోయ పాండు కుటుంబానికి జనసేన నాయకులు ఆదివారం రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు లాయర్ సతీష్, కత్రిమల సుబ్బు, వడ్డే రాము, శరత్, జమీర్, షేక్షావలి, రోషన్, సలీం, తదితరులు పాల్గొన్నారు.

మృతుని తల్లి లక్ష్మమ్మకు ఆర్థికసాయం అందజేస్తున్న జనసేన నాయకులు

మెగా వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి-యాడికి

మండల కేంద్రంలోని గుత్తి రోడ్డులో ఉన్న స్టార్ ప్యారడైజ్ హైస్కూల్లో ఆదివారం ఏర్పాటు చేసిన ఊపిరితిత్తుల వైద్య శిబిరానికి భారీ స్పందన లభించింది. ఇందులో భాగంగా 82 మంది శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్నట్లు లయన్స్ క్లబ్, మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా శాన్విక చెస్ట్, అలర్జీ కేర్ ఆసుపత్రి డాక్టర్ కోన మురళీధర్‌రెడ్డి ఊపిరితిత్తుల సమస్యలు ఎందుకొస్తాయనే విషయాలను వివరించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడే వారికి ఉచితంగా మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్యారడైజ్ స్కూల్ కరస్పాండెంట్ నాగేంద్ర, రంగస్వామి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చందగాని ధ్రువ నారాయణ, మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ అధ్యక్షుడు బండారు బాలకృష్ణ, సభ్యులు పర్లపాటి మహేంద్ర, చింతా నరసింహ, సాకరే శంకరప్ప, టి.లక్ష్మీకాంతమ్మ, పల్లా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల ప్రిన్సిపల్, పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ బదిలీ

అనంతపురం : అనంతపురం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు ఒంగోలుకు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు కడప జిజిహెచ్ సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. అలాగే గుంటూరు మెడికల్ కళాశాలలో న్యూరో సర్జరీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ కెవివి సత్యనారాయణను అనంతపురం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

రైల్వేస్టేషన్‌లో పోలీసుల తనిఖీలు

సోదాలు చేస్తున్న రైల్వే పోలీసులు

గుత్తి : స్థానిక రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ ఎస్ఐ నాగప్ప ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఇటీవల రైళ్లలో చోరీలు, దోపిడీలు అధిక కావడంతో స్టేషన్ లోని ఒకటవ, రెండవ ప్లాట్ ఫాంలలో జిఆర్పి పోలీసులు, ఆర్పిఎఫ్‌లు ముమ్మరంగా తనిఖీలు చేశారు. ప్రయాణికుల లగేజీని పరిశీలించారు. రైళ్లలో చోరీలు అరికట్టేందుకు చర్యలు చేపట్టామనిఎస్ఐ నాగప్ప తెలిపారు.

ఆలయ అభివృద్ధికి సహకరించండి

గుత్తి : పట్టణంలోని కోట ప్రాంతంలో వెలిసిన రామస్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలని రామస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు నాయకంటి శివప్రసాద్, కార్యదర్శి ఎంకె.చౌదరి కోరారు. గుత్తి పట్టణంలోని అన్నపూర్ణ రెసిడెన్సీలో ఎమ్మెల్సీ సోము వీర్రాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో చరిత్ర గల పురాతన రామస్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఆలయాన్ని పునర్నిర్మానం చేపట్టాలని వారు విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో రామస్వామి ఆలయ అభివద్ధి కమిటీ నాయకులు దాసా రమేష్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'షైనింగ్ స్టార్'కు ఎంపికైన స్టార్ ప్యారడైజ్ హైస్కూల్ విద్యార్థి

యాడికి : ఎస్ఎస్‌సి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రభుత్వం అందజేయనున్న షైనింగ్ స్టార్ పురస్కారానికి మండల కేంద్రంలోని స్టార్ ప్యారడైజ్ హైస్కూల్ విద్యార్థి ఇ.తేజ ఎంపికయ్యారు. ఈమేరకు సోమవారం అనంతపురంలో నిర్వహించనున్న కార్యక్రమంలో కలెక్టర్ వినోద్‌కుమార్‌తో తేజ పురస్కారాన్ని అందుకోనున్నారు. పురస్కారానికి ఎంపికైన విద్యార్థిని స్టార్ ప్యారడైజ్ హైస్కూల్ మేనేజ్‌మెంట్ నాగేంద్ర, రంగ, ఇలాహీ, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

విద్యార్థికి ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న ఉద్యోగులు

కళ్యాణదుర్గం రూరల్ : శెట్టూరు మండలం బసంపల్లి నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థి జి.దినేష్‌కు యూనియన్ బ్యాంకు ఉద్యోగి లోకేష్ రూ.15వేలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఒంటిమిద్ది నాగరాజు రూ.10వేలు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. దినేష్ నంద్యాలలోని ఆర్‌జిఎం కళాశాలలో బిటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈనేపథ్యంలో ఫీజు కట్టేందుకు ఇబ్బందులు పడుతున్నందున విషయం తెలుసుకున్న వారు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో అడల్ట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ రవి, టీచర్ సతీష్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి విజయ్, ఫీల్డ్ ఆఫీసర్ శేషు, చైతన్య, రాజప్ప, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం చేసిన నిందితులను శిక్షించాలి

విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

ఆత్మకూరు : సత్యసాయి జిల్లాలో రామగిరి మండలంలోని ఓ గ్రామంలో దళిత మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఎన్‌పిఆర్‌డి జిల్లా కార్యదర్శి ఎం.రామయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని వడ్డుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత చిన్నారిపై ఏకంగా 14 మంది అత్యాచారం చేయడం బాధాకరమన్నారు. తండ్రి లేని బాలికపై అత్యాచారం చేయడమే కాకుండా వీడియోలు తీసి వైరల్ చేయడం క్షమించరాని నేరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పిఆర్‌డి జిల్లా అధ్యక్షులు వసంత్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.గంగన్న, వెంకటేష్, కుళ్లాయప్ప, జింకా ఓబులేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సచివాలయాల పరిధిలో యోగా ర్యాలీలు

అనంతపురం కలెక్టరేట్ : అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా సోమవారం జిల్లాలోని నేడు గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో యోగా ర్యాలీలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి గ్రామస్థాయి, వార్డుస్థాయి, హాబిటేషన్ల స్థాయి, అన్ని నివాస ప్రాంతాల్లో ర్యాలీలు సాగుతాయన్నారు. సచివాలయ ఉద్యోగులు వారి పరిధిలో ఇంటింటికీ వెళ్లి యోగాపై అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు ప్రదానం

బొమ్మనహాల్ : మండల పరిధిలోని గోవిందవాడ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విన్నర్‌గా గోవిందవాడకు చెందిన ఆర్డీటీ కాలనీ జట్టు, రన్నర్‌గా కణేకల్లు జట్టు నిలిచాయి. విన్నర్ జట్టుకు రూ.41,125, రన్నర్ జట్టుకు రూ.20,225 అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సోమనాథ్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : ఆర్‌డిఓ

యోగా చేస్తున్న అధికారులు

కళ్యాణదుర్గం టౌన్ : అనేక ఒత్తిళ్లతో జీవనం గడుపుతున్న మానవాళికి యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆర్‌డిఓ వసంతబాబు సూచించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, తహశీల్దార్ బాస్కర్, వివిధ శాఖల అధికారులు, విశ్రాంతి ఉద్యోగులు, ప్రజలతో కలిసి జూనియర్ కళాశాల ఆవరణంలో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగాతో లభించే ఆరోగ్య విషయాలపై ప్రజలందరినీ చైతన్య పరచాలన్నారు. ఎవరికి వారు యోగా చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.

నేరాలు ఘోరాలు

రైలు కింద పడి వ్యక్తి మృతి

మృతిచెందిన వెంకటయ్య

గుత్తి : గుత్తి రైల్వేజంక్షన్ పరిధిలోని జక్కలచెరువు-రాయలచెరువు గ్రామాల మధ్య ఆదివారం రైలులో నుంచి ఓ వ్యక్తి కింద పడి మృతిచెందాడు. జిఆర్పి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణలోని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం చౌదరి పల్లికి చెందిన వెంకటయ్య (48) రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు కాలు పడి అక్కడికక్కడే మరణించాడు. ఘటనా స్థలాన్ని జిఆర్‌పి పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పొలాల్లో వ్యవసాయ పరికరాల చోరీ

పెద్దవడుగూరు : మండలంలోని కడదరగుట్టపల్లిలో రైతుల వ్యవసాయ పొలాల్లో ఏర్పాటు చేసుకున్న బిందు సేద్య పరికరాలను కొందరు గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు.. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బొలేరో వాహనంలో పొలాల్లోకి వచ్చి గ్రామానికి చెందిన మోహన్, శ్రీనివాసులు ఒక్కో రైతు పొలంలో ఏర్పాటు చేసిన రూ.50వేలు విలువజేసే బిందు సేద్య పరికరాలను చోరీ చేశారు. వెంకటేసు పొలంలో కాపర్ తీగలను ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతులు తెలిపారు.